మనీ లాండరింగ్ కేసు అంటూ బెదిరింపు

ప్రైవేటు ఉద్యోగి నుంచి

రూ.7లక్షల 16 వేలు వసూలు చేసిన సైబర్ నేరగాళ్లు

పటాన్‌చెరు టౌన్: మనీ లాండరింగ్ కేసులో సస్పెక్ట్‌గా ఉన్నావంటూ ఫోన్ చేసి బెదిరించి ఓ ప్రైవేట్ ఉద్యోగి నుండి రూ. 7లక్షల 16 వేలు సైబర్ నేరగాళ్లు కాజేసిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి ఈనెల 18వ తేదీ అపరిచిత వ్యక్తుల నుండి ఫోన్ కాల్ వచ్చింది. పోలీస్ డిపార్ట్‌మెంట్ నుండి కాల్ చేస్తున్నామని మనీలాండరింగ్ కేసులో మీ పేరు ఉందని, పేరు తప్పించేందుకు డబ్బులు ఇవ్వాలని భయపెట్టడంతో ఆ ఉద్యోగి అపరిచిత వ్యక్తి చెప్పిన విధాలుగా పలు దఫాలుగా రూ. 7లక్షల 16 వేలు వేశాడు. అపరిచిత వ్యక్తి ఇంకా డబ్బులు వేయాలని అడగడంతో బాధితుడు ముందుగా సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం గురువారం అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలి



వినతిపత్రం అందజేస్తున్న ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు

కేపీహెచ్‌బీకాలనీ: జేఎన్‌టీయూలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని ప్రొటెక్షన్ ఫోర్స్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ప్రొటెక్షన్ ఫోర్స్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ బిక్స్ సంచాలకులు ప్రొఫెసర్ వెంకటేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు రాహుల్ నాయక్ మాట్లాడుతూ.. యూనివర్సిటీలో డ్రైనేజీ సమస్య నానాటికీ తీవ్రంగా మారిందన్నారు. స్పందన బ్లాక్ ఏరియా, క్యాంటిన్ పరిసరాల్లో, క్యాంపస్ 2వ గేట్ వద్ద, కిన్నెర, మంజీరా వసతిగృహం వెనుక భాగంలో డ్రైనేజీ నీరు పొంగి బయటకు వస్తుండటంతో దుర్వాసనతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు నూతన పైపులైన్ ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో పిల్లి సిద్ధార్థ్, శివకృష్ణ, బ్రహ్మంగౌడ్, అర్జున్‌గౌడ్, చంద్రశేఖర్, సాయికుమార్ రాథోడ్, సాత్విక్, శ్రీను, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలు



ఆల్విన్‌కాలనీ: హనుమాన్‌నగర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్యపరీక్షలు నిర్వహించారు. సీపీఎం కూకట్‌పల్లి శాఖ కార్యదర్శి పి. ధర్మారావు, సభ్యుడు బాలరాజ్, పోలయ్య హాజరై మాట్లాడారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఉచిత వైద్య శిబిరాన్ని కార్మికశాఖ అధికారులతో కలిసి నిర్వహిస్తున్నామని తెలిపారు. సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం వైద్యాధికారులు మాట్లాడుతూ.. కార్మిక శాఖ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని, దీని ద్వారా రక్త పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గోపమ్మ, పార్వతమ్మ, జ్యోతి, నర్సమ్మ, కృష్ణారావు, గోపి, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులను పరిశీలించిన కార్పొరేటర్



పనులను పరిశీలిస్తున్న
కార్పొరేటర్ రోజాదేవి రంగారావు, అధికారులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ సబ్‌స్టేషన్ నుంచి హెచ్‌పీ పెట్రోల్‌బంక్ మీదుగా బాలకృష్ణ నగర్ వరకు జరుగుతున్న సీసీ రోడ్డు పనులను గురువారం అధికారులతో కలిసి కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..ట్రాఫిక్, వాటర్‌వర్క్స్, సీవరేజ్ లైన్లు, మ్యాన్‌హోల్ మరమ్మతులు, విద్యుత్‌పోల్స్ షిఫ్టింగ్ సమస్యలు ఉన్నాయని, అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. వీలైనంత త్వరగా నాణ్యతతో కూడిన సిమెంట్ రోడ్డు వేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్, అధికారులు అమీరుద్దీన్, నాయక్, సూర్యం, బాలకృష్ణ, వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు నాగేశ్వరరావు, శ్రీనివాస్‌రెడ్డి, రమణ, విక్రం, ప్రవీణ్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

పటాన్‌చెరు టౌన్: మత్స్యకారుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆ పార్టీ నేత నీలం మధు ముదిరాజ్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని పురస్కరించుకొని కొల్లాపూర్ నియోజకవర్గం కొల్లాపూర్‌లోని ఎస్ ఎమ్ గార్డెన్ ఫంక్షన్‌హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన సాంప్రదాయ మత్స్యకారుల 8వ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి చౌరస్తా నుండి సభా ప్రాంగణం వరకు డప్పు చప్పుళ్లతో, భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు కేవలం ఓటు బ్యాంకుగానే చూసిన మత్స్యకారులను రేవంత్ ప్రభుత్వం గుర్తించి గౌరవిస్తుందన్నారు. ఆ దిశగానే చెరువుల సంరక్షణకు శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి హైడ్రాను ఏర్పాటు చేసి చెరువుల పరిరక్షణకు కృషి చేస్తున్నారని కొనియాడారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణనతో ముదిరాజ్ లకు రాజకీయంగా అవకాశాలు పెరగడంతో చట్టసభల్లో మన వాణి వినిపించే అవకాశం లభించనుందన్నారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రజని, మల్లికార్జున్, కొల్లాపూర్ మత్స్యశాఖ వైస్ చైర్మన్ మల్లయ్య, వెంకటస్వామి ,నాగరాజు,మాజీ వైస్ ఎంపీపీ వెంకటస్వామి, మల్లయ్య, సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిపాదనల్లోనే ‘విప్రో సర్కిల్’



విప్రో సర్కిల్ ఇదే..

ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నేటికీ ప్రశ్నార్థకం

తాజాగా మెట్రో ప్రకటనతో మరుగున పడిన ఫ్లైఓవర్

రాయదుర్గం: నానక్‌రాంగూడలో ఐటీ కారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతంలో విప్రో సర్కిల్‌కు అత్యంత ప్రాధాన్యం ఉంది. ఈ కూడలి ద్వారానే ఇటు నానక్‌రాంగూడ, గౌలిదొడ్డి ప్రాంతాలకే కాకుండా ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ప్రాంతాల్లోని జాతీయ, అంతర్జాతీయ సంస్థలకు వెళ్లేందుకు ప్రధాన కూడలిగా మారింది. దీంతో విప్రో సర్కిల్‌ను మరింత సౌకర్యవంతంగా చేయాలనే ప్రతిపాదనలు అలాగే ఉంటున్నాయి. ఈ ప్రాంతంలో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. దీంతో ఇక్కడ ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టడానికి ఎన్నో ప్రతిపాదనలు చేసినా ఏవీ ఇప్పటివరకు అమలుకాలేదు. తాజాగా గతేడాది చివరలో ఫ్లైఓవర్ నిర్మాణానికి ప్రతిపాదన చేయగా ప్రభుత్వం ఆమోదం తెలిపినా ఆ తర్వాత ప్రభుత్వం మారడం, మెట్రో రైలును విప్రో సర్కిల్ మీదుగా ప్రతిపాదించడం తెలిసిందే.

మొదట్లో ‘ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి’

విప్రో సర్కిల్‌లో ఏపీఐఐసీగా కొనసాగిన సమయంలో కొనసాగినప్పుడు విప్రో సర్కిల్‌లో ‘ఫోర్ వే ఫుట్‌ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని తలపెట్టారు. ఆ తర్వాత రాష్ట్ర ఏర్పాటు, కొత్త ప్రభుత్వం ఏర్పడడంతో ఇది ప్రతిపాదనకే పరిమితమైంది. తాజాగా గత ఏడాది చివరలో శాసనసభలో ఎమ్మెల్యే గాంధీ విప్రో సర్కిల్‌లో ప్లస్ ఆకారంలో ఫ్లైఓవర్ నిర్మించాలని ప్రతిపాదించారు. అమెజాన్, అమెరికన్ కాన్సులేట్ వంటివి కూడా ఈ ప్రాంతంలోనే ఉండడం, భారీ సంస్థలు కొనసాగుతుండడంతో ఉద్యోగులు పెరుగుతుండడంతో విప్రో కూడలిలో ఫ్లైఓవర్ ఆవశ్యకత ఉంది. కానీ ప్రస్తుతం ఆ ఊసే లేదు.

రాయదుర్గం–నియోపోలీస్ వరకు మెట్రో..

మాదాపూర్‌లోని మైండ్‌స్పేస్ వద్ద రాయదుర్గం మెట్రోస్టేషన్ నుంచి హైదరాబాద్ నాలెడ్జి సిటీ మీదుగా ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లోని విప్రో సర్కిల్ మీదుగా నియోపోలీస్ వరకు మెట్రో ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అవసరమైన ప్రణాళిక, నిధుల కేటాయింపు, స్టేషన్ల గుర్తింపు అన్నీ పూర్తయ్యాయి. ఇక పనులు ప్రారంభించాల్సి ఉంది.

అర్బన్‌స్ట్రీట్ ఫర్నిచర్.. నిర్మించి వదిలేశారు..

ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఓఆర్‌ఆర్ వరకు ఉండే ప్రధాన రోడ్డుకు ఇరువైపులా అర్బన్ స్ట్రీట్ ఫర్నిచర్ ఏర్పాటు చేయాలని నాలుగేళ్ల క్రితం పనులు ప్రారంభించారు. ఆకట్టుకునేలా ఆహ్లాదపూరిత వాతావరణంలో గ్రీనరీతోపాటు పూలమొక్కల మధ్య నుంచి వాకింగ్, సైక్లింగ్ చేస్తూ అందరూ సేద తీరేలా దాదాపు ఒకవైపు విప్రో సర్కిల్ వరకు పూర్తి చేశారు. కానీ ఇప్పటి వరకు ప్రారంభించలేదు. సమీపంలోని నివాసితులు ఇక్కడ వాకింగ్ చేస్తున్నారు. కానీ పూర్తి స్థాయిలో చేపట్టలేకపోయారు.

బీఆర్‌టీఎస్ ప్రతిపాదన ఊసే లేదు..

ఐటీకారిడార్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, హైదరాబాద్ నాలెడ్జి సిటీలను కలుపుతూ బీఆర్‌టీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని 10ఏళ్ల క్రితం ప్రతిపాదించారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ నుంచి మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గంలోని ఐటీకంపెనీలు, హైదరాబాద్ నాలెడ్జి సిటీ మీదుగా ట్రిపుల్‌ఐటీ కూడలి మీదుగా విప్రో సర్కిల్ నుంచి ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌ను కలిపేలా బీఆర్‌టీఎస్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. కానీ ఆతర్వాత ఆదిశగా చర్యలు నిల్.

వైట్ టాపింగ్ రోడ్డు ఒకవైపే..

ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో ప్రధానరోడ్డుగా గుర్తించే ట్రిపుల్‌ఐటీ కూడలి నుంచి విప్రో సర్కిల్ మీదుగా ఓఆర్‌ఆర్ వరకున్న రోడ్డును వైట్ టాపింగ్ ఆరులేన్ల రోడ్డుగా మార్చాలని పనులను ప్రారంభించారు. ఐతే ఈ పనులతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో విప్రో సర్కిల్ వరకు పనులను చేపట్టి ఆపేశారు. ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అలాగే మిగిలిపోయింది. పెరుగుతున్న ట్రాఫిక్, ఇతర అంశాలను దృష్టిలో పెట్టుకొని విప్రో సర్కిల్ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

శేరిలింగంపల్లి: విద్యుత్ మరమ్మతుల కారణంగా ఎన్‌టీఆర్ నగర్, గోపన్‌పల్లి, మంజీర, ప్రతిమా ఫీడర్ల పరిధిలో శుక్రవారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు నల్లగండ్ల ఏఈ వెంకట్‌నారాయణరెడ్డి తెలిపారు.

- 11 కేవీ ఎన్‌టీఆర్ నగర్ ఫీడర్ పరిధిలో.. ఎన్‌టీఆర్ నగర్, గోపన్‌పల్లి తండా, తాజ్‌నగర్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు.
- 11 కేవీ గోపన్‌పల్లి ఫీడర్ పరిధిలో.. గోపన్‌పల్లి, డైమండ్ హిల్స్‌లో..
- 11కేవీ మంజీర ఫీడర్ పరిధిలో.. తెల్లాపూర్ రోడ్, మంజీర అపార్టుమెంట్స్‌లలో..
- 11 కేవీ ప్రతిమా ఫీడర్ పరిధిలోని ప్రతిమా విల్లాస్, ముప్పారోడ్డు గోపన్‌పల్లి తండాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, విద్యుత్ వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని ఏఈ కోరారు.

మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలో..

చందానగర్ : మదీనాగూడ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్ మరమ్మతుల కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ దీప్తి పేర్కొన్నారు.

- హనుమాన్ టెంపుల్ ఫీడర్ పరిధిలో.. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు మదీనాగూడ, ఆల్విన్ క్రాస్ రోడ్డు, మైత్రీనగర్ ఏరియాలలో విద్యుత్ ఉండదన్నారు.



హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో డిజైనింగ్ కాన్‌క్లేవ్‌లో పాల్గొన్న అతిథులు

డిజైనింగ్‌లో సృజనాత్మకతకు ప్రాధాన్యం

టీహబ్ ప్రాంగణంలో 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్

రాయదుర్గం: హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో గురువారం 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్‌ను ఘనంగా నిర్వహించారు. మార్స్‌మీడియా, ఇవాల్ స్కిల్స్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఫ్యాషన్, జ్యుయలరీ, ఇంటీరియర్స్, సస్టేనబిలిటీ, గేమింగ్, ఏఆర్/వీఆర్, ఉత్పత్తులు, హెల్త్‌కేర్, సాఫ్ట్‌వేర్, సైబర్ సెక్యూరిటీ లాంటి వివిధ రంగాలకు చెందిన నిపుణులు, పరిశ్రమల యజమానులు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం సజృనాత్మకమైన డిజైన్లు రూపొందించిన పలువురిని అవార్డులతో సత్కరించారు. ఈ సమావేశంలో టీవర్క్స్ సీఈఓ తనికెళ్ళ జోగిందర్ మాట్లాడుతూ డిజైనింగ్ రంగంలో సృజనాత్మకతకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రతి అంశానికి డిజైనింగ్ ఎంతో ముఖ్యమని, దానికి సృజనాత్మకతను జోడిస్తే ఎన్నో వైవిధ్యాలు కనిపిస్తాయన్నారు. టీహబ్‌లోని మాథ్ సీఈఓ రాహుల్ పైత్ మాట్లాడుతూ డిజైనింగ్ రంగానికి మంచి భవిష్యత్ ఉందన్నారు. 8 మ్యాట్రిక్స్ డిజైన్ కాన్‌క్లేవ్ వ్యవస్థాపకుడు, సీఈఓ రాజ్ సావన్కర్ మాట్లాడుతూ డిజైనింగ్ రంగంలో అద్భుతాలు సృష్టించేందుకు ఈ సదస్సు వేదికగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పలువురు డిజైనింగ్ నిపుణులు, వివిధ సంస్థలు, 8 మ్యాట్రిక్స్ డిజైన్ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనే లక్ష్యం



గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డిని కలిసిన ఎన్టీఆర్ కాలనీ, సోఫా కాలనీవాసులు

గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా పనిచేస్తామని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌లోని ఎన్టీఆర్ కాలనీ, సోఫా కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కాలనీవాసులు గురువారం గోపన్‌పల్లిలోని కార్పొరేటర్ కార్యాలయంలో కలిసి తమ ప్రాంతాలలో నెలకొన్న సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించాలని కోరారు. ఇందుకు ఆయన స్పందిస్తూ సంబంధిత అధికారులకు ఫోన్ చేసి సమస్యలను వివరించి వాటిని పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రణాళికాబద్ధంగా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అసంపూర్తి రోడ్ల లను త్వరితగతిన పరిష్కరిస్తామన్నారు. దశలవారీగా పనులు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు రాజునాయక్, శ్రీనివాస్, నర్సింహస్వామి, బాలకృష్ణ, వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ, కృష్ణ, లాల్‌సింగ్, విజయ్, హీర్యా, మోహన్‌బాబు, వెంకటేష్‌నాయక్, రాజు, సురేష్, గోపాలకృష్ణ, సత్యనారాయణరాజు, కళ్యాణ్‌నాయక్, రమేష్ ,స్థానికులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉండే వారికి అవకాశమివ్వాలి

బీజేపీ రంగారెడ్డి జిల్లా రిటర్నింగ్ అధికారి సుభాష్‌చందర్



సమావేశంలో పాల్గొన్న జిల్లా రిటర్నింగ్ అధికారి సుభాష్‌చందర్ తదితరులు

గచ్చిబౌలి: బూత్ స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండే వారిని అధ్యక్షులుగా నియమించాలని బీజేపీ రంగారెడ్డిజిల్లా రిటర్నింగ్ అధికారి సుభాష్‌చందర్ సూచించారు. శేరిలింగంపల్లిలోని మసీదు బండలోని బీజేపీ కార్యాలయంలో ఇన్‌చార్జ్ రవికుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ముఖ్య నాయకుల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే రోజుల్లో బూత్ అధ్యక్షుల నియామకం ఉంటుందని, ప్రజలకు ఎవరు అందుబాటులో ఉంటారో అలాంటి వారికే అవకాశం కల్పించాలని సూచించారు. రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ అందరూ కలిసికట్టుగా పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రాఘవేంద్రరావు, మణిభూషణ్, మహిపాల్‌రెడ్డి, రవీందర్‌రావు, అశోక్, వసంతకుమార్‌యాదవ్, ఆంజనేయులు సాగర్, కృష్ణముదిరాజ్, నర్సింగ్‌రావు, భూపాల్‌రెడ్డి, నవీన్‌గౌడ్, డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

రామచంద్రాపురంలో..

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : రాష్ట్రంలో బీజేపీ శక్తిమంతంగా తయారవుతుందని పార్టీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి అన్నారు. గురువారం రామచంద్రాపురం పట్టణంలో తెల్లాపూర్ మున్సిపల్ పార్టీ ముఖ్య నాయకులతో క్రియాశీల సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలలోకి తీసుకు వెళ్లి వివరించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అమలు చేయడంలో విఫలమవుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ శంషాబాద్ రాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్: మియాపూర్ డివిజన్ పరిధిలో శుక్రవారం ఉదయం 10 గంటలకు సీసీ రోడ్డు పనులకు ,అలాగే బొల్లారం మెయిన్‌రోడ్డు నుండి బీకే ఎన్‌క్లేవ్, రెడ్డి కాలనీ, ప్రజాషెల్టర్, మక్తమహబూబ్‌పేట విలేజ్ వరకు లింకురోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే గాంధీ ఓ ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు ,వార్డు సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు, బూత్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఐఆర్‌ఓఎస్–2024లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

6 పరిశోధనా పత్రాలు సమర్పణ



రాయదుర్గం: అంతర్జాతీయ సదస్సులో గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కి చెందిన రోబోటిక్స్ రిసెర్చ్ సెంటర్ బృందం సత్తా చాటింది. ఇటీవల అబుదాబిలో జరిగిన ఇంటలిజెంట్ రోబోట్స్ అండ్ సిస్టమ్స్(ఐఆర్‌ఓఎస్–2024) పై జరిగిన సదస్సులో ఈ బృందం ఆరు పరిశోధనా పత్రాలు సమర్పించారు. 1988 నుంచి ఐఆర్‌ఓఎస్ ప్రపంచంలోని అతిపెద్ద, అత్యంత ముఖ్యమైన రోబోటిక్స్ పరిశోధనా సదస్సుగా గుర్తింపు పొందింది.

శిల్పారామం ఎదుట వాటర్ ఫౌంటేన్



మాదాపూర్: శిల్పారామం ఎదుట వాటర్ ఫౌంటేన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దివంగత ఇందిరా గాంధీ విగ్రహానికి నలువైపులా 4 ఫౌంటేన్‌లను ఏర్పాటు చేస్తున్నారు. రాత్రిపూట రకరకాల రంగుల్లో సందర్శకులను ఆకట్టుకోనున్నాయి.

వ్యక్తి అదృశ్యం



వెంకన్న (ఫైల్)

చందానగర్ : ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన చందానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. వరంగల్ నర్సింహులపేట మండలం, పెద్దనాగారం గ్రామానికి చెందిన వెంకన్న (50) కుటుంబంతో సహా 10 సంవత్సరాల క్రితం నగరానికి వచ్చాడు. అతని భార్య అజ్మీరా కళ కూలీ పనులు చేసుకుంటున్నారు. రెండు సంవత్సరాల క్రితం వెంకన్నకు ప్రమాదం జరగడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. దీంతో వారికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో ఆరు నెలల కిత్రం వెంకన్న భార్య స్వగ్రామానికి వెళ్ళి బంగారు ఆభరణాలు తీసుకు వచ్చి గంగారంలోని ఓ బంగారు దుకాణంలో తాకట్టు పెట్టింది. ఈ నెల 17వ తేదీ వెంకన్న భార్య కుదువ పెట్టిన బంగారాన్ని తీసుకురావడానికి బయటకు వెళ్ళింది. తిరిగి ఇంటికి వచ్చి చూసేసరికి భర్త వెంకన్న కనబడకపోవడంతో బంధువులు, స్నేహితుల వద్ద విచారించినా ఫలితం లేకపోవడంతో గురువారం చందానగర్ పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం

- రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- ఇండియన్ ఫొటో ఫెస్టివల్– 2024 ప్రారంభం



మాదాపూర్: ఫొటోలతో జ్ఞాపకాలు పదిలం అని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీలో ఏర్పాటు చేసిన ఇండియన్ ఫొటో ఫెస్టివల్ 2024ను రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, తెలంగాణ టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావులు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫొటోగ్రఫీ అనేది ఒక ఆర్ట్ అని పెయింటింగ్ కంటే క్లిష్టమైనదన్నారు. ఫొటోగ్రాఫర్‌లు కెమెరాలలో అద్భుతమైన చిత్రాలను బంధించి మధుర జ్ఞాపకాలను అందిస్తున్నారన్నారు. హైదరాబాద్ నగరం ఎంతో అద్భుతంగా ఉంటుందని ఇక్కడి సంస్కృతి, సాంప్రదాయాలు ఆకట్టుకుంటాయన్నారు. కాగా ఫొటో ఫెస్టివల్ 10వ ఎడిషన్‌ను జనవరి 5వ తేదీ 2025 వరకు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శనలో 45 దేశాల నుంచి 550 మంది ఫొటోగ్రాఫర్‌ల 1500కి పైగా చిత్రాలను అందుబాటులో ఉంచారు. ఇండియా, యూఎస్‌ఏ, యూకే, దక్షిణాఫ్రికా, ఉజ్బెకిస్తాన్, వెనిజులా, టర్కీ, ఫ్రాన్స్, స్విట్జర్లాండ్, స్వీడన్, స్పెయిన్, సింగపూర్, సైబీరియా, రష్యా, కెనడా తదితర దేశాల ఫొటోగ్రాఫర్‌ల చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయి. కార్యక్రమంలో ఫిల్మ్‌మేకర్ సబీనా గాడిహోక్, ప్రొఫెసర్ జామియా, ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ జర్మనీ అమితాదేశాయ్, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.



చిత్రాలను పరిశీలిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

గవర్నర్‌ను కలిసిన మహిళా దక్షత సమితి కమిటీ సభ్యులు

చందానగర్ : చందానగర్ గంగారంలోని మహిళా దక్షత సమితి కమిటి, ట్రస్టీ సభ్యులు గురువారం రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సమితి కమిటి చైర్‌పర్సన్ సరోజ్ బజాజ్ మాట్లాడుతూ సుమన్ జూనియర్, ఒకేషనల్ కళాశాల, వీడీ బజాజ్ డిగ్రీ మహిళా కళాశాలలో వెయ్యి మంది బాలికలు విద్యనభ్యసిస్తున్నారని, మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.1.15 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మలా గోయంకా బాలికల హాస్టల్ వసతి ప్రాంగణాన్ని నూతనంగా నిర్మిస్తున్నామని గవర్నర్‌కు వివరించారు. అనంతరం గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ త్వరలోనే కళాశాలను సందర్శిస్తానన్నారని వారు తెలిపారు.

రూ.25.41 కోట్ల వ్యయంతో నాలాల విస్తరణ

ఎమ్మెల్యే గాంధీ



గఫూర్‌నగర్‌లో నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ ఇంజనీరింగ్ అధికారులు

గచ్చిబౌలి: వరద నీరు కాలనీలను ముంచెత్తకుండా రూ.25.41 కోట్ల అంచనా వ్యయంతో నాలాల విస్తరణ చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే, పీఏసీ చైర్మెన్ ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. గురువారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని సైబర్‌హిల్స్ కాలనీ నుంచి యూరో స్కూల్ వరకు, మాదాపూర్‌లోని గఫూర్‌నగర్ నుంచి దుర్గం చెరువు వరకు ఉన్న నాలాలను ఇంజనీరింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. రూ.13.86 కోట్ల వ్యయంతో సైబర్‌హిల్స్ నాలా, రూ.11.55 కోట్ల వ్యయంతో గఫూర్‌నగర్ నాలా విస్తరణ పనులు చేపడతామని తెలిపారు. ఆర్‌సీసీ బాక్స్ డ్రైన్ నిర్మాణం వల్ల ఉపశమనం కల్గుతుందన్నారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని, నాలాల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించాలన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని లోతట్టు ప్రాంతాలు, వరద నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ ఆనంద్, ఏఈ జగదీష్, కాంట్రాక్టర్ పీఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాలా పనులను వేగవంతం చేయాలి

మియాపూర్: నాలా విస్తరణ పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే గాంధీ అధికారులను ఆదేశించారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని గురునాథం చెరువు నుండి పటేల్ చెరువు వరకు చేపడుతున్న నాలా విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులు, కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలం వరదనీరు నాలాలో సాఫీగా ప్రవహించక చుట్టుప్రక్కల కాలనీలను ముంచెత్తుతుందని, వరదనీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా నాలా విస్తరణ పనులు చేపట్టామన్నారు. ఆయన వెంట అధికారులు డీఈ ఆనంద్, ఏఈ జగదీష్, కాంట్రాక్టర్ పీఎస్ రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, ఆనంద్ తదితరులున్నారు.